క్లుప్తంగా

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు



పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యానికి అనుగుణంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలకేంద్రం ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థిదశలో లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం విద్యార్థుల నోటుపుస్తకాలను పరిశీలించి పరీక్షలు, వ్యక్తిగత పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు మల్లేష్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, సీఆర్పీ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతాం



పాన్‌గల్: గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించే వరకు సీపీఎం ప్రజలకు అండగా ఉంటూ పోరాడుతుందని పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో పార్టీ బృందం పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు గ్రామంలోని చాలా మంది దరఖాస్తులు చేసుకున్న ఆయా సమస్యలు పరిష్కరించలేదన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తగు చర్యలు తీసుకోవాలని, లేనిచో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బాబునాయక్, కృష్ణయ్య, రాములు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన తండా వాసులు



పాన్‌గల్: సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం మండలంలోని తెల్లరాళ్ళపల్లితండాకు చెందిన కాంట్రాక్టర్ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో తండా వాసులు కలిసి సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో గిరిజనులకు ప్రాధాన్యత, తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపై చర్యలు తీసుకోవాలని సీఎంకు కోరారన్నారు. సీఎంను కలిసిన వారిలో రాజునాయక్, పరమేష్‌నాయక్, రఘు, నవీన్ పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు హామీని అమలుచేయాలి



పాన్‌గల్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, ఆసరా పింఛన్ల పెంపును వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి పరుశరాంమాదిగ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట పింఛన్ల పెంపు హామీ అమలుచేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పెంపును అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అదేవిధంగా 20 పంచాయతీల ఎదుట దీక్షలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, బాలస్వామి, పార్వతమ్మ, చిన్నమ్మ, కురవమ్మ, జానకయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అమరచింత: పోలీసు చట్టాలను ప్రతి విద్యార్థిని తెలుసుకుని వాటిపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ స్వాతి అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లే శివారులోని కేజీబీవీలో శనివారం వందేమాతరం ఫౌండేషన్ ద్వారా అక్షరజ్యోతి కార్యక్రమంలో భాగంగా గ్రామసభలో పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గురుకులాలు, కేజీబీవీలలో చదువుకుంటున్న వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ స్వప్నరాణి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా.. ముళ్ల బాట

- అధికారులు చూసినా చలించరా..?
- తిరుమలాయపల్లి నుంచి రామన్‌పాడు ప్రాజెక్టు వరకు అక్రమ రహదారి



తిరుమలాయపల్లి వద్ద ఎదురు వస్తున్న వాహనాలకు దారి చూపిస్తున్న ఆర్టీసీ బస్సు కండక్టర్

మదనాపురం: విధి నిర్వహణలో ఘోరమైన విఫలమైన అధికారులు ప్రజల ప్రాణాలు ఆటవిక రహదారిలో బలైపోతున్నా పట్టించుకోని నిర్లక్ష్యం .మదనాపురం మండలంలోని తిరుమలాయపల్లి నుంచి రామన్‌పాడు ప్రాజెక్టు వరకు దాదాపు 8 కిలోమీటర్ల పొడవునా రహదారి పేరుకే ఉంది కానీ వాస్తవంగా అక్కడ జరగుతోంది అక్రమాల పర్వదినం. 40ఫీట్ల రోడ్డును రెండువైపులా రైతులు తమపొలాలను రోడ్డులోకి విస్తరించుకోవడంతో రహదారి అంతా బోగ సముద్రమైంది. ఈ దారిలో ఆర్టీసీ బస్సు సైతం వెళ్లేందుకు స్థలం లేక రోడ్డుపైనే నిలిచి పోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎదురుగా వస్తే ప్రమాదం తప్పదు.

ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం

ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు రోడ్డు పైనే మొక్కలు నాటి తూతూ మంత్రంగా పని చేసినట్లే చేస్తున్నారు. మొక్కలు చెట్లుగా మారి ఇప్పుడు రోడ్డును ఆక్రమించేయడం వల్ల ట్రాఫిక్ నిలిచి పోతోంది. వాహనాలు నడపడం అంటే నరకానికి వెళ్లడమే. ఇంత అసౌకర్యం ఎదురైనా ఒక్క అధికారి కూడా స్పందించడం లేదని అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత అధికారులు కూడా ఏ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ స్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు. అధికారులు రోడ్డు అక్రమణ చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుని ఉండి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ప్రాజెక్టుల పేరుతో మాటలే కానీ, భౌతికంగా మార్పులు కనపడటం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రంగంలోకి దిగకపోతే, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడటం ఖాయం. గతంలో రోడ్డు ఇబ్బందివలన ప్రమాదాలు ఎన్నో చోటు చేసుకున్నాయి.

ప్రమాదాలు నిత్యకృత్యం



గుంటలు, దెబ్బతిన్న రోడ్డు వల్ల మా ఊరిలో చాలామంది గాయాలపాలవు తున్నారు. పాఠశాలకెళ్లే పిల్లల నుంచి, వృద్ధుల వరకు అందరూ భయంతో ప్రయాణిస్తున్నారు. ఈ సమస్యను ఎన్ని సార్లు అధికారులకు తెలిపినా, వారు పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యమే ఈ ప్ర మాదాలకు కారణం. రోడ్డులు మరమ్మతు చేయకపోతే, మేము పెద్ద ఆందోళన చేయాల్సి వస్తుంది. – కిషోర్‌కుమార్‌రెడ్డి, రామన్‌పాడు

మరమ్మతుకు ప్రతిపాదనలు

మదనాపురం నుంచి రామన్‌పాడు మీదుగా ఆత్మకూర్ వరకు 14 కిలోమీటర్ల పొడవును బీటీ రోడ్డును మరమ్మతులు చేసేందుకు ప్రతి పాదనలు పంపించాం. త్వరలో రానుంది, పనులు చేసే సమయంలో రోడ్డు ఆక్రమణ తొలగిస్తాం.

– వరప్రసాద్, ఏఈ, రామన్‌పాడు ప్రాజెక్టు

అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లో చేరిక



జూపల్లి అరుణ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు, కార్యకర్తలు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల యువకులు, కార్యకర్తలు శనివారం మంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరుతున్నారన్నారు. స్థానిక ఎన్నికలల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం తప్పక కృషి చేస్తానన్నారు. కురువ సంఘం భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ విండో వైస్‌చైర్మన్ భాస్కర్‌యాదవ్, రాముయాదవ్, పుల్లారావు, రాంచందర్, వహీద్, గిరిబాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ కేంద్రం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్



యూరియా పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో శనివారం పెబ్బేరు మండలంలోని శాఖాపూర్ వై గ్రామంలో సింగిల్ విండో ద్వారా యూరియా పంపిణీ కేంద్రాన్ని చైర్మన్ కోదండరామిరెడ్డి, వైస్‌చైర్మన్ జక్కుల ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్లస్టర్ గ్రామ రైతులకు ఒకరికి రెండు బస్తాల యూరియా ఇస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ షేక్ మున్నా, నాయకులు మాలపల్లి సురేందర్‌గౌడ్, రమణ, జక్కుల శ్రీనివాసులు, పగడాల కృష్ణ, సందీప్‌రెడ్డి, శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

జిల్లాలో రైతులకు యూరియా లేకుండా చాడాలని, లేదంటే రైతులకు మద్దతుగా సీపీఐ నిలిచి ఆందోళన చేపడతామని నియోజకవర్గ కన్వీనర్ రమేష్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రం పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సకాలంలో విడుదల చేయకపోవటమే కారణమన్నారు. కానీ కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్య పోరాటంలో రైతులు నష్టపోతున్నారని అది ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. జిల్లాలో పాన్‌గల్, ఆత్మకూరు, గోపాల్‌పేట, ఘనపురం మండలాల్లో రైతులు రోడ్డెక్కారని గుర్తు చేవారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, సీఎన్‌శెట్టి, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘనస్వాగతం



కొత్తకోటలో కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: మాజీ మంత్రి కేటీఆర్ గద్వాలలో జరిగే బహిరంగ సభకు రోడ్డు మార్గాన వెళ్తుండగా కొత్తకోట బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. మాజీ మంత్రి గద్వాలకు వెళ్తున్న సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి కొత్తకోట పట్టణంలో మదర్‌థెరిస్సా జంక్షన్ సమీపంలో మాజీ మంత్రికి ఘనస్వాగతం పలికారు. కార్యకర్తలను, నాయకులను చూసిన కేటీఆర్ బయటకు వచ్చి అభివాదం తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో జెడ్పీమాజీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మెన్ పి.సుఖేశిని, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు భీమా ప్రసన్నలక్ష్మి, కటికె శ్రీను జి.మంద ప్రశాంత్, గోపాల్‌నాయక్ ఉన్నారు.

బాధిత కుటుంబాలను మాజీ మంత్రి పరామర్శ



పెద్దగూడెం గ్రామంలో మృతదేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భోగం వెంకటస్వామి అకస్మికంగా మృతి చెందాడు. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వడ్డె బాలస్వామి భార్య లచ్చమ్మ శుక్రవారం మృతిచెందింది. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ యువజన విభాగానికి చెందిన జీవీ ప్రశాంత్ డైరీఫామ్‌ను సందర్శించారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు కె.మాణిక్యం, డేగా మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, మాజీ సర్పంచ్ కొండన్న, లక్ష్మీకాంతరెడ్డి, తోక తిరుమలయ్య, అన్నమయ్య, శ్రీను, చిరంజీవి, రాములు, బాలస్వామి, వంశి, బాలకృష్ణ, వెంకటయ్య, రాములు, అశోక్, చోటు, సునీల్, ఎంపీటీసీ ధర్మనాయక్, రాము, హేమంత్, నాగరాజు, తిమ్మన్న, ఉపసర్పంచ్ మహేష్, వెంకటయ్య, భగవంతు, అంజి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిలు అన్నిరంగాల్లో ముందుండాలి



పెద్దనర్సింహను సన్మానిస్తున్న వాల్మీకిసంఘం నాయకులు

చిన్నంబావి: వాల్మీకిబోయలు అన్నిరంగాల్లో ముందుండాలని నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం సంఘం జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన చెల్లపాడు పెద్దనర్సింహ నాయుడును మండల వాల్మీకి సంఘం నాయకులు సన్మానించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. వాల్మీకి బోయల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా విద్యపరంగా అన్నిరంగాల్లో ముందుండేలా చూడాలన్నారు. హక్కుల సాధన సాకారం కావాలంటే ఒకతాటిపై నడవాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా జిల్లా కన్వీనర్ నరసింహ మాట్లాడుతూ.. సంఘం కోసం తాను అహర్నిశలు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను ఇచ్చినందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఉమేష్‌నాయుడు, చల్లపాడు రామకృష్ణా, తాలుకా ఉపాధ్యక్షుడు జేవీకే నాయుడు, సత్యం నాయుడు, బాలకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవమ్మకు ఘన నివాళి



లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకురాలు ఎస్ఎస్ లక్ష్మీదేవమ్మ పార్టీకి సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు అన్నారు. లక్ష్మీదేవమ్మ మొదటి వర్ధంతిని శనివారం జిల్లా కేంద్రంలోని సీపీటీయూ కార్యాలయంలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యురాలు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ కార్యకర్తలతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవమ్మ ఐద్వా జిల్లా కార్యదర్శిగా ఎనలేని సేవలు చేశారని, 1987లో కరువు వచ్చినప్పుడు అంబలికేంద్రాలు ఏర్పాటుకు తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పరమేశ్వరచారి, కురుమయ్య, సాయిలీల, ఉమా, లలిత, గట్టయ్య, మదన్, బాలరాజు, మన్యం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

వనపర్తి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి దోస్త్ స్పాట్ అడ్మిషన్స్ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రఘునందన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీల వివరాలను కళాశాల నోటీస్‌బోర్డులో, వెబ్‌సైట్‌లో పెట్టినట్లు, తొలివిడతలో భాగంగా ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు, రెండోవిడతలో 18, 19 తేదీల్లో స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. కోర్సుల ఖాళీల వివరాలు.. బీఏ హెచ్‌ఈపీ, ఈపీపీ, హెచ్‌పీపీ, హెచ్‌పీసీఏ, ఇంగ్లిష్ మీడియం, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీఎస్ ఇంగ్లిష్ మీడియం బీజెడ్సీ ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ తెలుగు, ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉన్నాయన్నారు.

సాంస్కృతిక ఉత్సవాలు జయప్రదం చేయాలి



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలో బండి యాదగిరి సాంస్కృతిక ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న మండలస్థాయి బతుకమ్మ ఉత్సవాలు జయప్రదం చేయాలని కన్వీనర్లు భగత్, నిరంజన్, శివరాజ్ అన్నారు. శనివారం గ్రామంలో ఉత్సవాల కరపత్రాలను గ్రామస్తులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఉత్సవాలల్లో జానపద పాటలు, బతుకమ్మ పాటలు, డప్పులు, కోలాటం, భజనాలు, ఏకపాత్రాభినయాలు, పిల్లల నృత్యగీతాలు, కూచిపూడి నృత్యాలు, డిల్లెంపల్లెం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనేవారు రూ.100 చెల్లించి ఈనెల 25వ తేదీవరకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7981162271, 6281135378, 9703220791కు సంప్రదించాలన్నారు.

బెంచీల వితరణ



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని వెంగళరావు కాలనీలో కాంగ్రెస్ నాయకుడు కోట్ల రవి సొంత డబ్బులతో బెంచీలను శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసినట్లు రవి శనివారం తెలిపారు. కాలనీ ప్రజలకు కాసేపు ముచ్చటించేందుకు బెంచీలు ఏర్పాటు చేసినట్లు కోట్ల రవి తెలిపారు. ఈ సందర్భంగా బెంచీలు ఏర్పాటు చేయడంతో పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి శ్రీకారం



వీపనగండ్ల: మండలంలోని తూముకుంట గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మించాల్సిన రెండు అంగన్వాడీ భవనాలకు సరిపడా స్థలం లేకపోవడంతో భవన నిర్మాణాలకు నోచుకోలేదు. ఎట్టకేలకు పాఠశాల ఎదురుగా ఉన్న పాత బిల్డింగ్‌లను తొలగించి గ్రామానికి మంజూరు అయిన రెండు అంగన్వాడీ కేంద్ర భవనాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టడంతో చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

సంతలో వసతులు కరువు



వీపనగండ్ల: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంతలో ప్రజలకు కనీస వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. సంతకు గ్రామస్తులతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు నిత్యవసర సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. వర్షాకాలం కావడంతో కొద్దిపాటి వర్షానికే వ్యాపారస్తులు ఉండేందుకు ఎలాంటి షెడ్‌లు లేకపోవడంతో నిత్యవసర సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చే పలువురు నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేసి సంతలో మెరుగైన వసతులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీల్లో నిర్వహించాలి

కొత్తకోట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను కొనసాగించాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు యం.వన జ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం సీఐటీయూ జిల్లా కోశాధికారి నిక్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ.. విద్యాబోధన బాధ్యత అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, ఒకే ఆన్‌లైన్ యాప్ కలిగి ఉండాలని ఫైవ్ జి నెట్‌వర్క్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండలకార్యదర్శి రాధా, ఉపాధ్యక్షురాలు సావిత్రి, సువర్ణ, తస్లీమ్, కాళికా, ప్రసన్న, రేవతి, నీలమ్, భారతి, అన్నపూర్ణ, సునీత, జయలక్ష్మి, కళావతి ఉన్నారు.

సెప్టెంబర్17ను అధికారికంగా నిర్వహించాలి



అమరచింత: ప్రభుత్వం అధికారికంగా సెప్టెంబర్ 17ను నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు మండల కార్యదర్శి అబ్రహం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం అంబేద్కర్ భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాములు హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధపోరాటాన్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామని అధికారంలోకి వచ్చాక మరిచిపోయారన్నారు. ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికరంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రవీందర్, శ్యాంసుందర్, కుతుబ్, లక్ష్మీనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల ఏర్పాటు



అమరచింత: కొత్తగా ఏర్పాటు చేసిన సిమెంట్ విద్యుత్ స్తంభానికి విద్యుత్ తీగలను శనివారం ట్రాన్స్‌కో అధికారులు శనివారం బిగించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ రహదారిలో ఒరిగిన విద్యుత్ స్తంభం తొలగించిన ట్రాన్స్‌కో అధికారులు వాటి స్థానంలో సిమెంట్ స్తంభంను మూడు రోజుల కిందట ఏర్పాటు చేశారు. ఇనుప స్తంభం శనివారం కట్‌చేసి అక్కడి నుండి తరలించారు. కార్యక్రమంలో లైన్‌మెన్‌లు జగదీస్, రామకృష్ణ, అలీపాషా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కదిరెపాడు గ్రామంలో గుండె పోటుతో మృతిచెందిన వీరపాగ ఆదిత్య కుటుంబాన్ని శనివారం మండల బీఆర్ ఎస్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరసాగర్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, దశరథనాయుడు, సుధాకర్‌నాయక్, సత్యం, పరమేష్, నర్సింహానాయక్, కృష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా సాయుధ పోరాట వారోత్సవాలు

బిజినేపల్లి: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గం పిలుపు మేరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను శనివారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్ పాల్గొని సీపీఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కృష్ణాజీ, నాయకులు చంద్రమౌళి, మధుగౌడు, మంగంపేట శ్రీనివాస్, కిరణ్‌కుమార్, నారాయణ, సాయిలు, పోచమ్మ, పార్టీ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

గోపాల్‌పేట: మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రజలకు, జంతువులకు భద్రత ఉండటం లేదు. మండలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర దిమ్మెలు నిర్మిస్తున్నారు. కానీ కంచె ఏర్పాటు చేయడం లేదు. దీంతో కొన్ని సార్లు జంతువులు విద్యుత్‌షాక్‌కు ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే జనాలు సంచరించే స్థలాల్లో కూడా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఉండటం లేదు. దీంతో ప్రజలు ఎప్పుడు ఎవరు వైర్లకు తగిలి కరెంటుషాక్‌కు గురవుతారోనని ఆందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి సమీపంలోని బీటీ రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ఇక్కడే చెట్లు, కంప పెరిగిపోవడంతో స్థానికులు శుభ్రం చేయించారు. కానీ వైర్లు పైకి అమర్చడం లేదు. ఇక్కడ కాలనీవాసులు ఎప్పుడూ కూర్చుని ఉంటారు. పాఠశాలకు వెళ్లే చిన్నపిల్లలు వేచి ఉండి బస్సులు ఎక్కి వెళ్తుంటారు. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి కరెంటు వైర్లు పైకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఒక్క గోపాల్‌పేటలో కాకుండా ఆయా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.